క్లుప్తంగా

శ్రీకృష్ణాష్టమి వేడుకల పోస్టర్ విడుదల



పోస్టర్‌లను విడుదల చేస్తున్న డీఎస్పీ నాగరాజు

జమ్మలమడుగు : శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకకు సంబంధించిన పోస్టర్‌లను డీఎస్పీ నాగరాజు శుక్రవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వచ్చెనెల 6వ తేదీన జరిగే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని, కావలసిన భద్రతను తాము ఏర్పాటు చేస్తామని నిర్వాహకులకు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

చింతకొమ్మదిన్నె : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆర్‌డీ అనిల్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల ప్రభుత్వం గర్భిణుల పై ప్రత్యేక దృష్టి ఉంచి వారికి ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ శిబిరంలో వైద్య సిబ్బంది ద్వారా శిక్షణ ఇస్తారన్నారు. రక్తహీనత ఉన్న గర్భిణులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ భక్తవత్సలం, డి.డి.రామనాథరావు, జిల్లా మలేరియా అధికారి మనోరం, పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

గ్రూపు 1 విజేతకు సన్మానం



శివప్రియరెడ్డిని సన్మానిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పెద్దనపాడు గ్రామానికి చెందిన రామశేఖర్‌రెడ్డి కుమార్తె శివప్రియరెడ్డి గ్రూపు-1లో విజేతగా నిలిచి డీఎస్పీగా ఎంపికైంది. శుక్రవారం ఎర్రగుంట్ల మండల జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, డీఎస్పీగా ఎంపికైన శివప్రియరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెద్దనపాడు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు సాంబశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ట్యాంక్‌బండ్ లా తయారు చేస్తాం



ఊటుకూరు చెరువు కట్టను శుభ్రం చేస్తున్న జేసీబీ

చింతకొమ్మదిన్నె : ఊటుకూరు చెరువును ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేస్తామని నగర కమిషనర్ సాయిప్రవీణ్‌చంద్ తెలిపారు. శుక్రవారం ఆయన 45వ డివిజన్ కార్పొరేటర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలసి ఊటుకూరు చెరువుపై జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. గత నెల కడప పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కార్పొరేటర్ శ్రీనివాసులురెడ్డి ఊటుకూరు చెరువును ఆధునీకరించాలని విన్నవించారు. ముఖ్యమంత్రి కమిషనర్‌కు అంచనాలు తయారు చేసి పనులను ప్రారంభించాలని ఆదేశించారు. ఇందులో భాగంగా ఊటుకూరు చెరువు కట్టను కమిషనర్ పలుమార్లు పరిశీలించారు.

వెండి వస్తువుల వితరణ



అమ్మవారికి చేయించిన వెండి ఆభరణాలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీమిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారికి పులివెందుల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వేలూరు శ్రీనివాసులరెడ్డి దంపతులు వెండి వస్తువులను బహూకరించారు. వెండి హస్తాలు, పాదాలు, కాసుల దండ, నాగ కిరీటాన్ని ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డికి అందజేశారు.

కేసీఆర్ నిర్ణయం ముదిరాజులకు చెంపపెట్టు లాంటిది

కమలాపురం : తెలంగాణలో త్వరలో జరిగే ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ టికెట్ల కేటాయింపులో సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం ముదిరాజ్‌లకు చెంపపెట్టులాంటిదని వైఎస్సార్ జిల్లా ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు రాము ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ఆయన కమలాపురంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో ఇప్పటి వరకు 100 అసెంబ్లీ స్థానాలకు టికెట్లు ప్రకటించినప్పటికి ముదిరాజ్‌లకు ఒక్క టికెట్ కూడా కేటాయించలేదని మండి పడ్డారు. రాష్ట్ర జనాభాలో 13 శాతం జనాభా అంటే 60 లక్షల పైచిలుకు ముదిరాజ్‌లు ఉండగా ఒక్క టికెట్ కూడా కేటాయించక పోవడం దారుణం అన్నారు. ముఖ్యంగా గజ్వేల్, కామారెడ్డి, సిరిసిల్ల, సిద్ధిపేట్‌లో ఉన్న ముదిరాజులు బీఆర్‌ఎస్‌కు కాకుండా తమకు అనుకూలమైన పార్టీలకు ఓట్లు వేయాలని ఆయన కోరారు.

వరాలు కురిపించు.. వరలక్ష్మీమాత

- భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రతాలు
- ఆలయాలలో మహిళలు ప్రత్యేక పూజలు



పులివెందులలో అంకాలమ్మ ఆలయంలో సామూహిక వ్రతాలు చేస్తున్న మహిళలు

పులివెందుల టౌన్ : వరాలు కురిపించు వరలక్ష్మీమాత అంటూ ఆలయాలలో, తమ ఇళ్లలో మహిళలు శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అమ్మవారి కలశాన్ని ఏర్పాటు చేసి అమ్మ వారి ప్రతిమను ఉంచి వాయినాలను సమర్పించి ముత్తైదువులకు పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్, పూలు అందజేశారు. ముద్దనూరు రోడ్డు సమీపంలోని స్థానిక శ్రీచక్రసహిత మహాలక్ష్మి ఆలయంలో ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వరలక్ష్మి వ్రతము చేయడం వల్ల కలిగే ఫలితాన్ని వివరిస్తూ కథను చదివి వినిపించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అలాగే స్థానిక శ్రీమిట్టమల్లేశ్వరస్వామి, శ్రీఅంకాలమ్మ ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఆలయాల చైర్మన్లు సుధీకర్‌రెడ్డి, బ్యాటరీ ప్రసాద్‌లు వరలక్ష్మి సామూహిక వరలక్ష్మి వ్రతాలలో కూర్చొని పూజాది కైంకర్యాలు జరిపించారు.

పులివెందుల రూరల్ : మండల వ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మ వత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామాలలోని దేవాలయాలకు వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పట్టణంలో బ్రాహ్మణపల్లె రోడ్డులో ఉన్న చౌడేశ్వరి ఆలయంలో చైడేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాట చేశారు.

కమలాపురంలో..

కమలాపురం : మండలంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. శ్రావణ శుక్రవారంతో పాటు వరలక్ష్మీ వ్రతం రావడంతో మహిళలు తలస్నానాలాచరించి ఆలయాలకు చేరుకున్నారు. అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో రాత్రి లక్ష పూల పూజ, కుంకుమార్చన నిర్వహించారు.

వల్లూరులో..

వల్లూరు : మండల వ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా గృహాలను మామిడి తోరణాలు, అరటి పిలకలతో అలంకరించారు. పసుపుతో లక్ష్మీదేవి ప్రతిమను తయారు చేసి ఆమె ఎదుట కళశాలను ఏర్పాటు చేశారు. అష్టోత్తరం, లలితా సహస్ర నామాలను పఠించి , మహా నైవేద్యాలను సమర్పించారు. వరలక్ష్మీ వ్రత మహత్య కథలను చదువుతూ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

పుష్పగిరిలో పూజలు

పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైద్యనాథేశ్వరస్వామి ఆలయంలోని శ్రీ కామాక్షీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రీ చక్రానికి పూజలు చేసి కుంకుమార్చన నిర్వహించారు. శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అర్చనలు నిర్వహించారు. దుగ్గాయపల్లె, వెంకటాపురం వీవర్స్ కాలనీల్లోని చౌడేశ్వరీదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : పొలతల శైవ క్షేత్రంలోని మల్లేశ్వరస్వామి దేవస్థానం నందు శ్రావణ శుక్రవారం వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో ఆలయ ఈఓ మహేశ్వర్‌రెడ్డి సమక్ష్యంలో ఘనంగా వరలక్ష్మి వత్రం వేడుకలు నిర్వహించారు. వేదపండితులు వరలక్ష్మి వత్రం విశిష్టత గురించి మహిళలకు వివరించారు. చూట్టు పక్కల గ్రామాల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ మాజీ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యాక్షుడు నాగమల్లారెడ్డి పాల్గొన్నారు

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని పలు ఆలయాలు భక్తులతో రద్దీగా దర్శనమిచ్చాయి. సంగమేశ్వరాలయంలోని ప్రధాన అర్చకులు శర్మ భక్తి శ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఇంటింటా మహిళలు వరలక్ష్మి వ్రత నిర్వహించారు.

లింగాలలో..

లింగాల : మండలంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీదేవి వ్రత పూజలను ఇంటింటా నిర్వహించారు. ముత్తైదువులకు పసుపు, కుంకుమ, గాజులు, ఆకు వక్క వాయినాలను అందజేశారు.

చెన్నూరులో..

చెన్నూరు : స్థానిక రామలింగ చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



పులివెందులలో ప్రత్యేక అలంకరణలో శ్రీచక్రసహిత మహాలక్ష్మి అమ్మవారు



కమలాపురంలో అలంకరణలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి



వల్లూరు : వెంకటాపురం వీవర్స్ కాలనీలో ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీదేవి

డిపాజిట్లపై అధిక వడ్డీ చెల్లిస్తాం

కమలాపురం : తమ బ్యాంక్‌లో ఖాతాదారులు డిపాజిట్ చేస్తే మిగిలిన అన్ని బ్యాంకుల కన్నా అధిక వడ్డీ అందిస్తామని డీసీసీ బ్యాంక్ డీజీఎం వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మండలంలోని జంగంపల్లెలో ప్రజలకు డీసీసీ బ్యాంక్ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించి మాట్లాడారు. డీసీసీ బ్యాంక్ అంటే కేవలం రైతులకు మాత్రమే అనే భావన ప్రజల్లో ఉందన్నారు. తమ బ్యాంక్ ద్వారా అన్ని వర్గాల ప్రజలకు అన్ని రకాల రుణాలు అందిస్తామన్నారు. రైతులకు అవసరమైన దీర్ఘకాలిక రుణాలు, ల్యాండ్ డెవలప్‌మెంట్, గొర్రెలు, బర్రెలు, ట్రాక్టర్, పంటరుణాలు, పంటేతర రుణాలు అందిస్తామన్నారు. అలాగే అన్ని వర్గాల ప్రజలకు తక్కువ వడ్డీతోనే బంగారు రుణాలు, హౌసింగ్ రుణాలు అందిస్తామన్నారు. తమ బ్యాంక్‌లో కేవలం రూ.500తో మాత్రమే ఖాతా తెరవవచ్చన్నారు. లాకర్ సౌకర్యం సైతం తమ బ్యాంక్‌లో ఉందన్నారు. కమలాపురం బ్రాంచ్ మేనేజర్ సుధీర్ కుమార్‌రెడ్డి, సూపర్‌వైజర్ వీరశేఖర, పెద్దచెప్పలి పీఏసీఎస్ సీఈఓ ఓబుల్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బండలాగుడు పోటీలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని శ్రీరంగరాజుపల్లి సమీపంలో వెలసిన వీరాంజనేయస్వామి ఆలయంలో రెండవ శ్రావణ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే సీనియర్ వృషభ రాజములతో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నామని రూ.500 నగదు చెల్లించి రసీదు పొందాలన్నారు. మధ్యాహ్నం కోలాటం, రామాంజనేయ యుద్ధం, చింతామణి, హరిచంద్ర నాటకం ప్రదర్శించడం జరుగుతుందన్నారు.

నాటుసారా స్వాధీనం

లింగాల : ఇప్పట్ల గ్రామ సమీపంలోని కొండలో నాటుసారా తయారు చేసి పులివెందులకు తీసుకుని వెళ్తున్న కావేటి మోహన్ అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసి అతని వద్దనుంచి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి) లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ కిడ్నీ వైద్యులు దినేష్‌కుమార్‌రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్స్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి గుండెజబ్బు వైద్యులు హితేష్‌రెడ్డి గుండె సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. అలాగే షుగర్ పరీక్షలకు సంబంధించి వైద్యులు హర్షవర్ధన్‌రెడ్డి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

వేముల : ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సభాభవనంలో శుక్రవారం వైఎస్ ఆర్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, జడ్పీటీసీ కోగటం బయపురెడ్డిలతో కలిసి ఆయన ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి మౌలిక వసతులు కల్పించడంపై దృష్టి సారించాలన్నారు. పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు బిల్లులు అందేలా చూడాలన్నారు. గతంలో ఇళ్లు మంజూరై రూ.30వేల లోపు బిల్లు తీసుకుని మిగిలిన బిల్లులు రాని లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేసి మిగిలిన బిల్లును చెల్లించడం జరుగుతుందన్నారు. అలాగే రూ.30వేలకు పైన ఎంతో కొంత బిల్లు తీసుకుని మిగిలిన బిల్లులు అందని లబ్ధిదారులకు ఆ పై మొత్తాన్ని చెల్లిస్తే మిగిలిన బిల్లులు మొత్తం చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాంటి వారు మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఉన్నట్లైతే గుర్తించాలని సూచించారు. గ్రామాల్లో చౌడు మిద్దెలు తొలగించి స్లాప్ వేసుకునే లబ్ధిదారులకు రూ.40వేలు ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, డీఈ రమణారెడ్డి, ఏఈ రామసూరారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాఘవరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి

లింగాల : మండలంలో హౌసింగ్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఓఎస్‌డీ అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ పనుల పురోగతిపై మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని జగనన్న కాలనీలు, వ్యక్తిగతంగా మంజూరైన పక్కా గృహాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అక్కడక్కడ అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాల నిర్మాణాన్ని లబ్ధిదారులను ప్రోత్సహింపజేసి త్వరితగతిన పూర్తి చేసేందుకు మండల అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జున, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ సురేంద్రనాథ్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఈ క్రాప్ తప్పని సరిగా చేసుకోవాలి

వేముల : రైతులు సాగు చేసిన ప్రతి పంటకు ఈ క్రాప్ చేయించుకోవాలని పులివెందుల ఏడీఏ అశోక్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గొందిపల్లెలో శుక్రవారం ఈక్రాప్ పంట నమోదును ఏఓ చెన్నారెడ్డితో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. వ్యవసాయశాఖ అమలు చేస్తున్న పెట్టుబడి రాయితీ, ఉచిత పంటల బీమా, సున్నావడ్డీ, పంట రుణాలు, మద్దతు ధర పంట కొనుగోలు వంటి ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే పంట నమోదు కీలకమన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ లక్ష్మిదేవి, రైతులు పాల్గొన్నారు.

ఆచార్య తుమ్మపూడి మృతి తీరని లోటు

కడప కల్చరల్ : సుప్రసిద్ధ సాహితీవేత్త, విమర్శకులు, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ విశ్రాంత అధ్యాపకులు ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు మృతి తెలుగు సాహిత్య రంగానికి తీరని లోటని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం పూర్వ సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శుక్రవారం ఆచార్య తుమ్మపూడి సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఆచార్య తుమ్మపూడి కవిగా, విమర్శకుడుగా, అనువాదకుడుగా, నాటకకర్తగా అందించిన సేవలు చిరస్మరణీయమైనవన్నారు. శ్రీకృష్ణదేవరాయలపై అభిమానంతో విలక్షణ రచనలు చేశారన్నారు. ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, ఆచార్య హెచ్‌యస్ బ్రహ్మానంద, ఆచార్య పీఎల్ శ్రీనివాసరెడ్డి వంటి వారంతా ఆయన శిష్యులేనన్నారు. కడపతో ఆయనకు అనుబంధం ఉందని, భూతపురి సుబ్రహ్మణ్య శర్మ స్మారక సత్కారంతో గౌరవింపబడ్డారన్నారు. సహాయ పరిశోధకులు భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ ఆచార్య తుమ్మపూడి సాహితీరంగానికి చేసిన సేవలు కొనియాడారు. లైబ్రరీ అసిస్టెంట్ ఎస్. రమేష్‌రావు కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రేపు గ్రూప్స్ విజేతలకు సత్కారం

కడప కల్చరల్ : కడప నగరం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఇటీవల గ్రూప్-1లో టాపర్లుగా నిలిచిన అభ్యర్థులు వంకం సాయిహర్షిత, చందులను సత్కరించనున్నామని బీసీ సంక్షేమ సంఘం నిర్వాహకులు చౌడం సూరిబాబు తెలిపారు. నగర మేయర్ సురేష్‌బాబు, డి ప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా హాజరు కానున్నారన్నారు.

పసుపు కొనుగోలు అక్రమాలపై విచారణ జరపాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని మైదుకూరు పసుపు కొనుగోలులో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరపాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ పసుపు కొనుగోలు అక్రమాలపై జిల్లా కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర రావును విచారణ కమిటీగా నియమించారని.. ఈ కమి టీ పట్ల అపోహలు ఉన్నాయన్నారు. గ్రామా ల్లో రాజకీయ బెదిరింపులు రైతులకు ఉన్నాయని, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి చేత విచారణ జరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల కృష్ణయ్య పాల్గొన్నారు.

నేడు గండిలో శ్రావణ శనివారోత్సవం

చక్రాయపేట : గండి పుణ్యక్షేత్రంలోని వీరాంజనేయ స్వామి సన్నిధిలో నేడు రెండవ శ్రావణమాస శనివారోత్సవం జరుగనుంది. గత వారం కంటే ఈవారం భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉంటాయని భావించిన ఆలయవర్గాలు అందుకు ఏర్పాట్లను సిద్ధం చేశారు. గత వారంలో తలెత్తిన చిన్న చిన్న లోపాలను సరిదిద్ది ఉత్సవాలకు తగు ఏర్పాట్లు చేశామని ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. భక్తుల కోసం 22వేల లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే స్నానాలు చేసిన అనంతరం మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా తగు ఏర్పాట్లు చేశామన్నారు. భక్తుల స్నానాల నిమిత్తం పాపాఘ్ని నదిలో పిల్లర్లు వేయించి స్నానపు ఘట్టాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 3గంటలనుంచి పూజా కార్యక్రమాలు ఉంటాయ ఆలయ ప్రధాన. ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు తెలిపారు. అలాగే రాత్రి బస చేయు భక్తులకు కాలక్షేపం నిమిత్తం కోలాటం అనంతరం సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం ప్రదర్శించడం జరుగుతుందన్నారు. రెండవ శనివారం భారీ వాహణాలను అనుమతించమని ఆర్కే వ్యాలీ సీఐ గోవిందరెడ్డి తెలిపారు. లారీలు టిప్పర్లు తదితర వాటిని వేంపల్లెలోనే ఆపేస్తామన్నారు. రాయచోటి వైపు నుంచి వచ్చే వాటిని చిలేకాంపల్లె క్రాస్ వద్ద నుంచి వెనక్కు పంపిస్తామన్నారు. బస్సులు కార్లు తదితరాలను భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకుని తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఉత్సవాల సందర్భంగా ముగ్గరు సీఐలు, 13 మంది ఎస్ఐలతో పాటు సుమారు 180 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తారన్నారు.



గండి వీరాంజనేయస్వామి



పాపాఘ్ని నదిలో ఏర్పాటు చేసిన స్నాన ఘట్టం

పనిచేసినవారికి ప్రత్యేక గుర్తింపు



సజ్జలతో మాట్లాడుతున్న హృషికేశవరెడ్డి

జమ్మలమడుగు: పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రత్యేక గుర్తింపు ఇస్తామని ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపినట్లు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు హృషికేశవరెడ్డి వెల్లడించారు. ఏపీఈడబ్ల్యూ పీడీసీ డైరెక్టర్ వెంకటశివమ్మ కుమారుడైన ఈయన శుక్రవారం కడప ఎయిర్ పోర్టులో 'సజ్జల'కు స్వాగతం పలికారు. పలు విషయాలపై ఆయనతో చర్చించారు.

ప్రత్యేక ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

పులివెందుల టౌన్ : ఎంపీ అవినాష్ రెడ్డి ముందస్తు జన్మదిన వేడుకలను పులివెందుల బంగారు బజారులో స్వర్ణకారుల సంఘం ప్రెసిడెంట్ నూరుల్లా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో రవి, నవీన్, ఓతూరు రసూల్, సమీవుల్లా, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

వీరపునాయునిపల్లె : మండల కేంద్రంలోని వీఆర్‌ఎస్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం డిక్సన్ కంపెనీ నిర్వహించనున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి తెలిపారు. శుక్రవారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే జాబ్‌మేళా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ఈ జాబ్ మేళాలో పురుషులు ఐటీఐ, డిప్లొమా, బీటెక్, మహిళలు 10వ తరగతి, ఆపై తరగతుల వారందరూ పాల్గొనవచ్చన్నారు. మండలంలోని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఓటర్ల జాబితా వెరిఫికేషన్ పక్కాగా జరగాలి

చెన్నూరు : బీఎల్వోలు, సూపర్‌వైజర్లు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ జాబితాను వెరిఫికేషన్ చేసి, అందులో ఓటర్‌లిస్టులో పేరు డిలీట్ అయిన వారిని గుర్తించి వారికి ఓటు హక్కు కలిగే విధంగా చర్యలు చేపట్టాలని కమలాపురం నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్టర్ అధికారి చంద్రమోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన మండల తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2024 సంబంధించి ఓటర్ లిస్టులో మార్పులు చేర్పులు అలాగే తొలగింపులు, ఒక పోలింగ్ స్టేషన్ నుంచి మరొక పోలింగ్ స్టేషన్‌కు ఓటు బదిలీ వంటి వాటిని పక్కాగా నిర్వహించాలన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న 36 పోలింగ్ స్టేషన్లను పరిశీలించి అక్కడ ఉన్న సమస్యలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్ పఠాన్ అలీఖాన్, డిప్యూటీ తహసీల్దార్, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిజిస్టర్ అధికారి చంద్రమోహన్

ఉపాధి కల్పించడమే న్యాక్ ధ్యేయం

పులివెందుల రూరల్ : నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే న్యాక్ ధ్యేయమని న్యాక్ ఇన్‌చార్జి రాకేష్ అన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పులివెందులలోని స్కిల్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సిడాప్ ఆ ధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రాకర్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ ద్వారా డ్రోన్ టెక్నాలజీలో వెల్ స్ప్రింగ్స్ కంపెనీ ద్వారా ఎలక్ట్రికల్ టెక్నాలజీ కోసం దరఖాస్తులు ఆహ్వానించడం జరిగిందన్నారు. పైన తెలిపిన వృత్తి విద్యా కోర్సులకు శిక్షణ అందిస్తామన్నారు. ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, బీటెక్ చదివిన అభ్యర్థులకు నేషనల్ అకాడమి నందు ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 28లోపు హాజరుకావాలన్నారు. సుమారు 120 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు భోజన వసతి కల్పిస్తామన్నారు. అర్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. వివరాలకు 9640015507, 90005 17637 నెంబర్లను సంప్రదించాలన్నారు.

పోలీసు కుటుంబాలకు ఆర్థిక సాయం

కడప అర్బన్: ఇటీవల అనారోగ్యంతో మరణించిన పోలీసు కుటుంబాలకు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ శుక్రవారం ఆర్థిక సాయం చేశారు. ఏఆర్ ఎస్ఐ కె. రామమోహన్ కుటుంబానికి ఎస్పీ రూ. 2.25 లక్షల ఆర్థికసాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఇందులో పోలీసు వితరణ నిధి నుంచి రూ. 2 లక్షలు, ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ.25 వేలు మొత్తాన్ని ఆర్థిక సాయంగా అందజేశారు. ప్రొద్దుటూరు వన్‌టౌన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మరణించిన టి. సుదర్శన్ సతీమణి సువర్ణకు రూ. 2 లక్షలు, ఫ్లాగ్‌ఫండ్ నుంచి రూ. 25 వేలు అందజేశారు. వాటర్‌బాయ్‌గా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మరణించిన పి. రెడ్డెయ్య సతీమణి పి. తులశమ్మకు రూ. 2.50 లక్షలు ఆర్థిక సాయం చెక్కు రూపంలో అందచేశారు.

వారసత్వ సంపదపై అవగాహన అవసరం

వైవీయూ/ కడప కల్చరల్: జిల్లాలోని అద్భుత వారసత్వ సంపద పట్ల విద్యార్థుల్లో అవగాహన అవసరమని ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె. చిన్నపరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఇంటాక్ ఆధ్వర్యంలో నగరంలోని 13 పాఠశాలల విద్యార్థులకు జిల్లా, రాష్ట్ర , జాతీయస్థాయి వారసత్వ సంపద అంశాలపై క్విజ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నప రెడ్డి, ఇంటాక్ అనంతపురం చాప్టర్ కన్వీనర్ రాంకుమార్ మాట్లాడుతూ వారసత్వ సంపద సమాచారాన్ని భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్, లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు పోతుల వెంకట్రామిరెడ్డి, ఇంటాక్ కో కన్వీనర్ పి.వి. సుబ్బారెడ్డి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్ధన్ రాజు మాట్లాడారు. క్విజ్‌లో ప్రథమ స్థానంలో బాలవికాస్ హైస్కూల్ విద్యార్థులు , రెండో స్థానంలో శాంతినికేతన్ పాఠశాల, మూడో స్థానంలో బాలవికాస్ హైస్కూల్ 2వ జట్టు, నాలుగో స్థానంలో శాంతినికేతన్ హైస్కూల్ 2వ జట్టు నిలువగా, ప్రత్యేక బహుమతి నజ్ముల్ అమీన్ హైస్కూల్ జట్టుకు ప్రకటించి బహుమతులు అందజేశారు. వీరిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు పాల్గొన్నారు.